


# ఊరు మేలుకుంది

సానపెట్టినా ప్రకాశించని వజ్రం, ట్యూషన్ పెట్టినా పాసవని విద్యార్థి, గిలిగింతలు పెట్టినా నవ్వని ముఖం, తోకతొక్కినా కరవని పాము — ఇవన్నీ మా ఊరి కోవలోకే వస్తాయి.

అది ఒకప్పటి మాట.

ఇప్పుడు ?—

అది మేలుకుంది. దీర్ఘనిద్రనించి మేలుకుంది.

ఆ వూరి పేటకు దూరంగా – పేటగాలి సోకనంత దూరంగా, వంద లోగిళ్లున్నాయి. ఆ వూరి జనసంఖ్యలో అది అల్పమే. అయినా ఆవుండే స్థలాన్నే వూరని అంటూ వుంటారు. వూరెప్పుడూ శుచిగా, శుభ్రంగా, నిత్య పర్వంగా వుంటుంది. అక్కడి చక్కని రోడ్లు పేటలోని ఇళ్ళకన్నా శుభ్రంగా వుంటాయి. ఆ రోడ్లకి ఇటూ అటూ తీర్చిదిద్దినట్లు లోగిళ్లుంటాయి. ఆ లోగిళ్ళముందు ధాన్యాగారాలెప్పుడూ

నిండుగా, అక్షయపాత్రల్లా వాళ్ళ జీవితాలకి అభయదామాల్లా వుంటాయి.

ఆ లోగిళ్ళలో పెద్దవి రెండు.

అవే ఆ వూరిని పాలిస్తూ వుంటాయి. అందులో ఒకటి రాయుడి గారిది, రెండోది మున్సబుగారిది.

ఆ వూళ్ళోని కూలీల రెక్కలెప్పుడూ ఆడుతోనే వుంటాయి. వాళ్ళ కండలు కరిగి ఎరువులు అక్కర్లేకుండగనే అక్కడి పొలాలు విరగ పండుతున్నాయి. ఆ పంటంతా వూరి లోగిళ్ళలో నిండుతున్నాయి.

పేటలో మాత్రం, రెండోర్రోజులకు సరిపడా గింజలు ఎన్నడూ వాళ్ళ ఇళ్ళల్లో వుండవు. పిల్లలు నగ్నంగానూ, ఆడాళ్లు అర్ధనగ్నంగానూ దరిద్రానికి దారి ఇదే అన్నట్టు వుంటారు. అర్ధాకలితోనైనా పని చేయడమేగాని కాస్తంత కూలెక్కువ అడుగుదామని వాళ్ళెన్నడూ అనుకోరు.

— మా తాత బతికుండగా యింతే కూలి, మా బాబూ ఇంతే తెచ్చీవోడు. మేం మాత్తరం ఎక్కువెందుకడగాలి? దయుంటే ఆ మారాజులే కొత్త పడేత్తారు.

ఇదీ, ఆ పేట గొంతు.

ఆ గొంతు విని, ఎందరో నాయకులు వాళ్ళని బాగుచెయ్యాలని కంకణం కట్టుకుని, విసుగెత్తి, ఆపైన విప్పేసుకుని వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. కాని, వాళ్ళు నాటిన విత్తనాలు అవకాశం చిక్కగానే అంకురించటానికీ, అక్కడి వాతావరణానికి అలవాటు పడటానికీ వేచి వున్నాయి.

అకలేసి రామలింగడి గుర్రం సాయిబు గెడ్డం పీకేసిందిట

కాని, ఆ పేటలో డొక్కలెండిన బర్రెకూడా తనది కాదనుకుంటే పక్కనున్న పచ్చగడ్డి పరకకూడా ముట్టదు.

అలాంటివూరు అమాంతం మేలుకుంది.

ధాన్యంధర విపరీతంగా పెరిగిపోయింది. దానితోబాటే అన్నీను. కూలి కుంచాలతో కొలవటం మానేసి పైసల్లో లెక్కపెట్టి ఇస్తున్నారు. అప్పుడు గాని వాళ్ళ శ్రమ విలువ ఏఁవిటో తెల్సివచ్చిందిగాదు కూలీలకు.

తెల్సివచ్చాకనే వూరు మేలుకుంది.

o o o

'ఎవుడి బాదాడిది' అన్నాడు నూకాలు.

ఆ మాటలు విన్నాక రాయబారానికి వచ్చిన రత్తాలు రాపడిపోయేడు. నోట మాట రాక, కాస్సేపాగి —

'ఇంతకీ నీ బాదేంటంటా?' అనడిగేడు రత్తాలు.

'ఇది నాదొక్కడి బాద కాదు.'

'అందరిమాటట్టాగుంచు. నీకు పొయ్యేకాలం ఏంటంట? నువ్వేమన్నా తిండిలేక దిగమారిపోతన్నావా?'

నూకాలికి రెండెకరాల పొలం వుంది. కాస్తో కూస్తో చదువూ అబ్బింది. జరుగుబాటువల్లో లేక జరుగుబాటు లేనివాళ్ళని వుద్ధరించాలనే తపనవల్లో కార్మిక నాయకులకూడా తిరిగి పేదవాళ్ళ సమస్యల్నీ, అవి పరిష్కరించబడే మార్గాల్నీ అధ్యయనం చేస్తున్నాడు. అతనికి మూడుపూట్లా తినటానికి తిండి వుంది. ఉండటానికో మంచి యిల్లు వాళ్ళ నాన్నే కట్టించిపోయేడు. అందుకనే వెటకారంగా మాట్లాడేడు రత్తాలు.

రత్తాలుకూడా అందరితోబాటు కూలి చేసుకునేవాడే. ఈమధ్య కొంచెం అంతస్తు పెంచుకుని బంటాలువేసి పనులకి తీసికెళ్తున్నాడు. ఇటు కూలీల దగ్గరా, అటు రైతులదగ్గిరా కమీషన్ కొట్టేస్తూవుంటాడు. ఊడ్పుల్లోనూ, కోతలప్పుడూ వ్యవసాయం పనులూ, వేసవికాలంలో మట్టిపనులూ చేయిస్తూ వుంటాడు. కూలీలు సమ్మెచేయటంతో అతనికి రాబడి తగ్గిపోయింది. అందుకనే రైతుల తరపున రాయబారాని కొచ్చేడు.

'అందుకే ఎవడి బాధ వాడిదంటున్నాను.'

'అంటే ?'

'అంటే— రెక్కాడితేగాని డొక్కాడని వాడికీ రెక్కాడినా డొక్కాడని రోజులొచ్చేయి. రోజంతా కష్టపడ్డా ఒక్కపూటే తిని కడుపులో కాళ్లెట్టుకుని పడుకున్నాడేగాని కూలోడు ఒక్కనాడూ నాకింత కావాలని అడగలేదు. మరి ఒక్కపూటైనా తిండి దొరక్కపోతే ఏం జేస్తాడు ? కనికరించి కాస్త పడెయ్యమని దేబెరించటం లేదు. కష్టానికి తగిన కూలిమ్మంటున్నాడు. అది వాడి జన్మహక్కు. దాన్ని సాధించటం కోసం ఇన్ని అగచాట్లు పడ్తున్నాడు. అది వాడి బాధ. కష్టపడి పండించి యింట్లో పోస్తుంటే కమ్మగాతిని పండుకుంటున్న వాడికి కాస్త ఎక్కువ కూలిస్తే వాడి కోటలెక్కడ కూలిపోతాయో, వాడి కొడుక్కి హైదరాబాదులో గుర్రాలమీదా, గజ్జెలగుర్రాల మీదా గుమ్మరించటానికి రూపాయలెక్కడ తరిగిపోతాయోనని ఉన్నవాడిబాధ. ఇక నీ బాధంటావా ? కూలీలంతా సమ్మె చేస్తుంటే నీ కమీషన్ నీకు ముట్టడం లేదని నీ బాధ. అంతేనా ?'

కాస్సేపటివరకూ ఏం చెప్పాలో తెలీక తటపటాయించేడు రత్తాలు. ఆ తర్వాత—

'బంటాలున్నా లేకపోయినా నా కమీషను నాకు ముడతానే వుంది.'

'అదేకదా మరి వాళ్ల గొవ్వతనం? లేకుంటే నువు రాయబారం ఎందుకు నడుపుతావు? నువు మాత్రిం మాలోవాడివి కాదా?'

'మాలో వాణ్నేగాని చేతగాని వాణ్ని మాత్రిం గాదు'

'తెలుస్తానే వుంది. కూలోడికి పుట్టి, కూలోడిగా పెరిగికూడా నువు కూలోణ్నే దోపిడీ చేస్తున్నావు. సరే! అదీగాక, పెద్ద దోపిడి గాడ్ని ఉసిగొల్పి మరింత దోచుకోడానికి వాడికి సాయపడ్తున్నావు.'

రత్తాలుకి సమాధానం ఏమీ చిక్కటం లేదు.

'ఇంతకీ ఏమంటావు?' అడిగేడు ముఖం చిట్లించి.

'ఇంత దూరమూ ఒచ్చావు. అదీగూడ నువ్వేచెప్పు మరి! ఇందరి బాధలూ ఒకేసారి తీరేదెట్లానో'

'నన్నడిగితే పనిలోకి పొమ్మనే చెబుతాను.'

'అవున్లే! నువు చెప్పేదేంటో మాకు తెలీదా? అప్పుడు అసలు వాడి బాధ తప్ప అందరి బాధలూ తీరిపోతాయి.'

'పోనీ రాజీకుదర్దని చెప్పేయమంటావా?'

'కుదర్దని నే నన్నానా! చేతనైతే రాజీ చెయ్యి. ఆడదానికి ఐదు రూపాయలూ, మగాడికి ఆర్రూపాయలూ ఇచ్చెయ్యమను. లేదంటావా ఆడదానికి ఆరు మానికలూ, మగాడికి రెండు కుంచాలూ కొలవమను. అవెలాగూ పిచ్చికుంచాలే గాబట్టి వాళ్లకీ అట్టే పోయేదేంలేదు.'

'అన్నీ నువ్వే సెప్పేసావు. ఇంకాళ్లకే(వుంది సెప్పటానికి?'

'నా సొంతానికి నేనేం చెప్పటం లేదు. వాళ్లందరి తరపునా నన్నే చెప్పమంటే అదే చెబుతున్నాను. అయినా ఇంక మిగిలిందంతా వాళ్లు చెప్పాల్సిందేగా?'

'మరైతే వూళ్ళోకి రా. రాయుడు బాబుతోటి సువ్వే మాటాడు దువ్‌గాని'

'నేనొక్కణ్ణే ఒస్తే ఎట్లా? మెంబర్రాంవు డున్నాడు. రంగయ్యన్నున్నాడు. వాళ్లుగూడ రావాలి'

'అయితే ఆళ్లని కూడగట్టుకు రా మరి'

ం ం ం

రాయుడిగారి లోగిలి ముందు రైతు కూలీల మధ్య రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

'మీరడిగినట్లే డబ్బు కాకుండా ధాన్యమే యిస్తాం కూలి. కాని కళ్లం గింజల మాటెత్త కూడదు' అన్నాడు రాయుడు.

'కూలాడెలాగూ కళ్లం మాటెత్తనే యెత్తడు. పాలేరైతే ఎలానూ తప్పదు' అన్నాడు నూకాలు.

'పాలేరైనా పైవాడైనా అంతే'

'అయితే పాలేరు కూడా పై పనోళ్లతో బాటే పదిగంటల కొస్తాడు పనిలోకి. అర్ధరాత్రి వచ్చి మీ గొడ్ల దగ్గర బాగుచేసి మీ ఇంటిల్లిపాటికీ ఎందుకు సేవ చెయ్యాలి?'

'అన్నీ ఆలోచించుకొని మరీ వచ్చారన్నమాట! రాజీ కోసం రాలేదు'

'అలాగని మేమంటంలేదు బాబయ్యా' అందుకున్నాడు మెంబరాంవుడు.

రాముడికి రాయుడి దగ్గిర అణకువ హెచ్చు. భయస్తుడు, దానికి తోడు కాస్త అనూలుకత కూడా చోటు చేసుకుంది అతనిలో. అందుకే

ఏ పేచీ లేకుండ, ఎక్కడ వేలిముద్ర వేయమంటే, అక్కడే వేస్తా డనే వుద్దేశంతో అతన్ని పంచాయితీ మెంబరు చేశాడు రాయుడు. అప్పట్నుంచీ మెంబర్రావుడయిపోయేడు. రాయుడికి విశ్వాసపాత్రుడుగా స్థిరపడిపోయేడు. అతని మాటలకి మళ్ళీ రాయుడు చివ్వున లేచేడు.

'మరేఁవిటి మీరంటున్నది? అవతల పొలాలు పండి ఒరిగి వున్నాయి. మేఘాలు చూస్తే ఎప్పుడు ముంచేస్తాయా అన్నట్టు హడావుడి చేస్తున్నాయి. సరిగ్గా సమయం చూసి మీరు సమ్మె అంటే, ఏ కొంచెం వర్షం వడ్డా గింజలు మొలిచిపోతాయి. అప్పుడు అందరం అడుక్కు తినాలి'

'అన్నీ సవ్యంగా జరిగినా మాకు అడుక్కుతినే పద్ధతి ఎప్పుడూ దాచి పెట్టే వుంచుతారు'

'నూకాలూ! కాస్త మాటలొచ్చని నీ యిష్టవచ్చినట్లు వాగకు. రైతు, కూలోణ్ణి ఎన్నడైనా అన్యాయం చేశాడా? చేయాలనుకుంటే ఇంతకాలం ఎందుకు వోపిక పడతాం? ఈ పాటికి పై వూళ్లనించి కూలాళ్లని తెచ్చుకోలేక పోయామా?

'పై వూరి వాడు మీకు వూరికే వస్తాడు?

'ఊరికే రాకపోతే పట్టుధల ఒచ్చినప్పుడు ఓ సావలా ఎక్కువే పడేస్తాం'

'అంటే, మాలో మాకే పోటీ పెట్టి, మా పొట్టలే కొట్టేస్తారన్న మాట! అదెంత మాత్రం కుదర్దు. ఆళ్లెలాగొస్తారో మేఁవూ చూస్తాం' అన్నాడు రంగయ్య ఆవేశంగా.

'మరి నువ్వేమంటావు రాముడూ'

'నేనొకణ్ణే అనేదేంటి బాబయ్యా! అందరితో బాటే నేనూను' అనేశాడు రాముడు ఎలాగో కూడబలుక్కుని.

రాయుడు మున్సబుకు కన్ను గీటాడు. అతను సర్దుకుని గొంతు సవరించి—

'ఒరే రాఁవుడూ నువ్వూ రంగడూ కో-ఆపరేటివ్ బేంకులో అప్పు తీసుకున్నట్టున్నారే?' అన్నాడు లౌక్యంగా.

'మేమెప్పుడూ పుచ్చుగున్నట్టు లేదే' అన్నాడు రంగయ్య.

'మర్చిపోయుంటార్లే' అని గుమస్తాని పిల్చి 'చూడండి ఆ లోను పుస్తకాలు ఇలా పట్రండి' అని పురమాయించేడు.

పుస్తకాలు పుచ్చుకుని పేజీలు తిప్పేడు.

'ఆఁ .. ఇదిగో.... మీరు కాదన్నా కాగితా లెక్కడికిపోతాయి. చూడు రాముడూ ఈ సంతకం నీదేనా? '

'నాదిలాగే వుందండయ్యా'

'నీదిరా రంగయ్యా....'

'నువ్వు చూడనక్కర్లేదులే రంగయ్యా. అది నీ సంతకమే అయుంటుంది. సంతకం చెయ్యడమేగాని అదేవిటో చదవడం చాత గాని మనల్ని మోసం చెయ్యటం ఎలాగో వీరికి బాగా తెల్సు' అన్నాడు సూకాలు.

'అంటే ఇవన్నీ దొంగ పద్దులంటారా?'

'ఎలాగంటాంలే బాబూ, సంతకాలు మావే. ఋణాలు మాత్రం మేఁవుచ్చుకోలేదు.'

'అలాగని కోర్టులో చెప్పుకుందురులెండి. ఇది సహకారసంఘం. ప్రజల సొమ్ము తినేసి వూరుకుందామంటే కుదర్దు'.

'మంచిగున్నప్పుడు సంతకాలు పెట్టించుకుని ఇలా దొంగ పద్దును బనాయింతారా ?'

'ఎవర్రా దొంగలూ ! అప్పు తీసుకుని లేదని బొంకుతున్న మీరు దొంగలు'.

'ఇన్నాళ్లు ఎందుకూరుకున్నారు ?'

'ఏదో మంచిగా పోతున్నాం. పేటలో కాస్త కలిగినవాళ్లు మీరు. నోటీసులిస్తే అవమానించినట్లుంటుందనీ....'

'ఈ యెనిమిదేళ్ళనించీ అందుకే పూరుకున్నారా ?'

'అయన్నీ ఎందుకు రంగన్నా.... దొంగని నువు ఎందుకు దొంగిలించావంటే ఏం చెప్తాడు ?'

'ఒరేయ్, తలతిక్కగా మాట్టాడకండి. తిక్క బించేస్తాను'

'ఎందుకు బాబయ్యా అంతంత పెద్దమాటలు... మమ్మల్నేం సెయ్యమంటారో సొప్పండి'

'మీవాళ్ళ నందర్నీ పనిలోకైనా పంపండి. లేదా డబ్బయినా కట్టండి'

'అంత డబ్బెక్కడిదయ్యా ?'

'అయితే సమ్మె రద్దు చెయ్యండి'

'సెప్పి సూత్తాంలెండి బాబయ్యా. తఁవరు మాత్తరం తొందర పడమాకండి' అన్నాడు రాఁవుడు.

'ఏంటి చెప్పేది ? నీ యిష్టమూ నా యిష్టమూనా చెప్పటానికి ?'

'ఎందుకురా అంత దూకుడూ, టీపఁవుండగానే యిల్లు సక్క బెట్టుకోవాల' అని వేదాంతం చెప్పేడు రాముడు.

o o o

'ఆ రాయుడి దొంగ పద్దులికి అదిరిపోయి మమ్మల్నందర్నీ నట్టేట్లో ముంచెయ్యటానికి సూత్తన్నారన్నమాట!' అన్నాడు ఆవేశంగా వీరాస్వామి.

వీరాస్వామి పాతికేళ్ళ యువకుడు. నల్లగా, మొద్దుగా పోతరించిన యెనుబోతులా వుంటాడు. అతని చేతిలో కర్ర వుంటే పోలీసు, వాడి చట్టమూ అదిరిపోతాయి. అతడు కూలి సంఘానికి గుండెకాయ.

వీరాస్వామిని ఒప్పించటానికి మెంబర్లిప్పుడు కొంచెం జంకేరు. అసలే పొద్దుట జరిగిన సంఘటనతో వాడు మండిపడిపోతున్నాడు. రాయుడన్నా, రాయుడు పేరు విన్నా నిప్పులు కక్కుతున్నాడు.

— పొలిమేర పక్క ఆక్రమణలో చిన్న పాకేసుకుని ఒక గేదెను మేపుకుంటున్నాడు వీరాస్వామి. సమ్మె మూలంగా నాలుగు రోజుల్నుంచీ దాన్ని విప్పనూలేదు, కడుపుకి కాస్త గడ్డీ వెయ్యలేదు. పక్కనే రాయుడిగారి స్థలంలో పెద్ద గడ్డిమేటుంది. దాన్నిండా రెండేళ్ళ నాటి పాతగడ్డీ, దాంట్లోంచి వొచ్చే కమ్మని జనుం వాసనా చూస్తూ ఎంతోకాలం వోపిక పట్టలేక తాడు తెంచుకుని, వాము చుట్టూవున్న కంచెను ఛేదించి కడుపునిండా గడ్డి మేసింది. అది చూసి రాయుడి మనుషులు దాన్ని వాళ్ళ దొడ్డిలో కట్టేశారు. గేదెను విడిపించుకోడానికెళ్ళి ఉదయం రాయుడితో ఘర్షణ పడ్డాడు వీరాస్వామి.

'గడ్డి నీ బాబు దనుకున్నావా?' అనడిగేడు రాయుడు.

'కాదు. దాని బాబుదే అనుకునుంటది' అన్నాడు వీరాస్వామి వెటకారంగా.

'ఒరే వీరా, నీ రౌడీ మాటలు చాలించవోయ్'

'లేకపోతే ఏంటయ్యా. అది నాలుగ్గుప్పిట్లు తింటే నీ గడ్డంతా తరిగిపోద్దా?'

'తరిగిపోద్దో లేదో, అది నా గడ్డి. నా దూడలు కొత్తగడ్డి తినవు. ఆ వున్నదే సంవత్సరందాకా రావాలి'

'నీ దూడలు కొత్తగడ్డి తినవు. నా గేదెకి అదిగూడలేదు. నీకు సంవత్సరం గాసం సరిపోవాలి. మరి నా గేదికి వారం రోజుల్నించీ గడ్డిపరకే లేదాయె. ఏం సేద్ది మరి? ఆకలవుతున్నదానికి యెదర గడ్డి కనపడతావుంటె వూరుకుంటదా?'

'గడ్డి పెట్టలేనోడికి నీకు గేదెందుకు?'

'మాకు గడ్డిలేక ఏడుత్తుంటే నీకంత గడ్డెందుకు? ఇయ్యాల్టికే తిండి లేక మా గొడ్లు సత్తావుంటే రేపటకి దాసుకునే అక్కర నీ కెక్కడిది?'

'ఏఁవిట్రా నీ తల తిరుగుడూ? అయితే నీ గేదెను ఒదలం. ఏంచేస్తావో చూస్తాం'

'గంటలోపల గేదె నా పాకలో గనక లేపోతే నానేంసేత్తానో నువ్వే సూత్తావు' అని ఒచ్చేశాడు. — ఆ వేడి ఇంకా చల్లారలేదు వీరాస్వామికి.

'పద్దులికి బయమేసిగాదురా యీరన్నా. ఎన్ని రోజులు యిలా పత్తులుంటారు? ఉంకో రొండ్రోజులుంటే పిల్లా మేకా సచ్చిపోతారు' అని సమర్ధించబోయేడు మెంబర్రావుడు.

'సత్తాం సత్తామని ఒకటే గోల. పణ్జెత్తె సావంటిగామోసు'

'మనం సమ్మె సమ్మెంటూ గూకుంటే అళ్ళు పైవూళ్ళనించి మనుసుల్ని తెప్పించుగుంటారు. అప్పుడేం సేత్తాం?'

'మనఁవంతా ముండలఁవయితే అలాగే తెచ్చుకుంటారు'

'ఒరే యీరన్నా. ఇన్నిమాట లెందుగ్గానీ, అసలాళ్లవళ్ళతట్టో అడుగు'

'ఎవళ్ళ తట్టా తెలవటంలా, నాలుగేళ్ళు లోపలికెళ్ళేటప్పటికి మనోళ్ళే యిట్టాగుంటే, ఇంకా ఆ రాయుణ్ని ఆడిపోసుకోటమెందుకెహే ? పోనీండి, ఇంక ఆళ్ళదారి ఆళ్ళదే. మందారి మందే !'

'అలాంటి ఆలోచన్లు ఎప్పుడూ పెట్టుకోమాకండి. మనకు వేరు వేరు దార్లుల్లేవు. అందరికీ ఒకటే దారి. చస్తే అందరం చద్దాం' అన్నాడు నూకాలు ఆవేశంగా.

'ఏంటి నూకాలూ, అక్కడా బాబుతోటి ఆ మాట సెప్పొచ్చి మల్లీ యిదేం మాట ?'

'అక్కడ నేనేం చెప్పలేదే !'

'నువు జెప్పకపోతే, నేజెప్పాగా మరి ! ఆడసలే నాగుబాము. ఎక్కడ కాటేత్తాడో ఏమో !:'

'వాడు నాగుబామైతే నువు ముంగిసవి. తెలివీ దమ్మూ వుంటే నువ్వే కాటెయ్యొచ్చు'

'నానేంటి కాటేసేది ? కప్పలాంటోణ్ని'

'నువు కప్పవుకావు. ఆ విషప్పురుగు కోరలు నీగుప్పెట్లో వున్నాయి. వాటిని పీకెయ్యటమో, లేక మా మీదికి తోలటమో అది నీ చేతిలో పని.'

నూకాలు మాటలకి రాముడితోబాటు అందరూ ఆశ్చర్యపోయేరు.

'ఏంటి ? లేడిని పులిమీదికే వుసిగొల్పుతున్నావు ?'

'నువు లేడివో, పులివో — అంతా నీ మనసులోనేవుంది. నిజానికి నీవు లేడివీకాదు పులివీకాదు. కప్పవీ కాదు పామువీకాదు. నువు పాముని గొట్టే ముంగిసవి. పులిని పైతం హడలుగొట్టే సింహానివి. తెల్సిందా ?'

'నాకేం తెల్టంలా !!'

'అయితే నే జ్ఞెపుతా విను. రాయుడు భూమి సీలింగునుంచి బయట పడటానికి నీకు పాతికెకరాలు రాశాడా లేదా ?'

రాముడు ఆశ్చర్యపోయేడు.

'నీకెట్టా తెల్పింటిరా నూకాలూ ?'

'నా కందరిగుట్టు తెల్సు'

'అయితే ఏంటంటావు ?'

'ఆ భూమిని స్వాధీనం చేసుకో. అందులోని ఫలసాయం అనుభవించు.

'అంతన్నాయం నాజ్జెయ్య లేను.'

'నువ్వు చెయ్యలేకపోతే ఆ రాయుడే చేస్తాడు. ఎప్పుడో చావ దన్ని మళ్ళీ రాయించుకుని మరీ చంపేస్తాడు. అయినా, అన్యాయం ఎవర్ది ? ప్రభుత్వాన్ని మోసం చెయ్యటం అన్యాయం కాదూ ? పేదాళ్ల పొట్టలు కొట్టి బొక్కసం నింపుకొనటం అన్యాయం కదూ ? తప్పుడు పద్దులు పుట్టించి డబ్బు కట్టమనడం అన్యాయం కదూ ?'

'ఎవడన్నాయం జేత్తె ఆడే పోతాడు'

'అన్నాయంగాదేటీగాదు. మల్లా పంచాయితీ మెంబరివ్వదేమో నని బెంగ' అని వెటకారం చేసేడు వీరాస్వామి.

'ఎందుకొచ్చిన మెంబరు. వాళ్ళ యిష్టంవచ్చినట్లు చేసుకుంటూ ఎక్కడ వేలిముద్ర వెయ్యమంటే అక్కడ వేసేసే ఆ మెంబరుద్యోగం ఎందుకు ?' అన్నాడు నూకాలు.

రాముడికి ఇంతవరకూ ఆ పొలానికి సంబంధించిన కిటుకు తెలియలా. నూకాలు మాటల్తో స్వార్థం చిగురించటం మొదలైంది.

'మరేం సెయ్యమంటావ్ ?' అనడిగేడు.

'నేను చెప్పినట్టే చెయి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ'

'నిజంగా ఆ భూమి ఆళ్ళదేగా మరి!'

'నిజమో నిజమో అని ఒకటే గొడవ. పైనున్న భూములన్నీ పేదలకి పంచాలని ప్రభుత్వం భూపరిమితి చట్టం తెస్తే, పాతికెకరాలు నీకు రాసి, యీబై ఎకరాలు సముద్రం ముంచేస్తుందని, మరో యీబై భార్యకు విడాకులిచ్చి సెంటు నేల మిగులు చూపించలా. ఇందులో ఏది నిజం? ఆ పాతికెకరాలూ నీది కాకపోవటమా? పాతిక మైళ్ళ దూరంలో వున్న సముద్రం పొలాలు ముంచెయ్యటమా? లేక ఏడేటా పిల్లల్ని కంటున్న పెళ్ళానికి విడాకులిచ్చెయ్యటమా? ఏది నిజం?'

'అందుకే అన్నేయం అంటున్నది'

'నిజమే. కాని ఇప్పుడా భూమి నీది కాదనుకోనటం అన్యాయం'

ఈ చర్చ జరుగుతోన్న సమయంలోనే సత్తెయ్య పరుగెత్తు కొచ్చేడు. సత్తెయ్య రాయుడి దగ్గర పాలేరు. పాలేళ్ళ సంఘానికి నాయకుడు. రాత్రే సభచేసి పాలేళ్ళుకూడా సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

'నూకాలన్నా! రైతులంతా మీటింగెట్టుకున్నారు. పేటలో వోళ్ళెవళ్ళూ ఆళ్ళ పొలాల్లో అడుగు పెట్టగూడదంట! తోటలో ఆకు గాని కమ్మగాని ముట్టుగుంటె అయిదు రూపాయిలు జురుమానా అంట.'

'మరి నాగేదెమాటేంజేసారు సత్తెయ్యా' అడిగేడు వీరాస్వామి.

'యీసారి కొటిలెయ్యమన్నారు. ఉప్పుడే పాకలో కట్టే సొత్తన్నా. ఇంక ఒటిత్తే యేలంపాటేసేత్తారంట'

'చూసావా రాంవన్నా! ఇదింతటితో ఆగిపోదు. ఇప్పుడేం చెయ్యాలో నువ్వే చెప్పు. పొద్దున్నే లేచి యేటి వొడ్డుకు పోవాలన్నా రైతుల పొలం గట్లంట పోవాలి. ఈ సమస్యని ఎట్లా ఎదుర్కోనటం?'

'మరేం పరవాలేదు నూకాలూ. మన రాముడన్న పాతికేకరాల కొబ్బరితోట వుందిగా' అనేశాడు వీరాస్వామి.

*  *  *

మెంబరాప్పుడికి రాయుడి దగ్గర్నుంచి పిలుపొచ్చింది. వెంట నూకాలూ, వీరాస్వామీ వెళ్ళేరు.

రాయుడు బుసలు కొడుతున్నాడు.

'నా కొబ్బరితోట దింపు తీయించావంటగా ?'

'నా కోకళ్ళ సొమ్ము ఆసించే బుద్ధి లేదు బాబయ్యా'

రాయుడు అదిరిపోయేడు.

తమ తర్ఫీదు వృధాపోనందుకు నూకాలు లోపల్లోపలే ఆనందించేడు.

'నాకర్థమైందిరా రాముడూ. ఆ పొలం నీదని కదూ నీవంటున్నది. నోరులేని వాజమ్మవని నమ్మి నీ చేతిలో అయిదులక్షల రూపాయిల ఆస్తి పెడితే ఇంత ద్రోహం చేస్తావా ?'

'రాతిరీ పగలూ అనకుండ మీకు సేకరి సేత్తన్నోళ్ళకి మీరు సేసే అన్నాయం కంటేనా ?'

పులిని చంపిన లేడిలా గర్వంగా సమాధానం చెప్పేడు రాముడు. కాని మళ్ళీ పులి బతికి వచ్చినంతగా భయపడి పోయేడు.

'నువు విశ్వాస పాత్రుడివని పంచాయితీ మెంబర్ని చేశాను. పై ఏరంకి ప్రెసిడెంటునే చెయ్యాలనుకుంటున్నాను'

'అయన్నీ కట్టిపడేసే కపుర్లుగానా, ఇంకేమైనా వుంటే సెప్పండి' అన్నాడు వీరాస్వామి.

'ఇంకేం వుంది. నా పొలం సంగతే'

'కాని, మాకింకా చాల సమస్యలున్నాయి'

'ఏంటి ?'

'మొట్టమొదటిది బేంకు రుణం'

'దానికి పద్దులున్నాయి'

'మాదగ్గిర దస్తావేజులుకూడా వున్నాయి'

'మీరంతా తెలివిమీరి పోయారా?'

'చాల ఆలస్యంగా తెలుసుకున్నారు'

'దుర్మార్గుల్లారా, వెళ్ళండి నా ముందునుంచి. ఉండండి మీ అంతు తేలుస్తా' అంటూ దెబ్బతిన్న పులిలా గాండ్రిస్తూ తన అందమైన గుహలోకి వెళ్ళిపోయేడు రాయుడు.

* * *

తెల్లవారితే పైవూళ్ళనించి కూలీలు వస్తారు. తమ సమ్మె నిష్ప్రయోజనం అయిపోతుంది.

రాత్రికి సమావేశం జరిగింది.

'ఈ వూరుగా వెవడొచ్చి పన్జేసినా పేణాలు తీసెయ్యాల. అందుకు మనమంతా సిద్ధంగా వుండాల' అని హెచ్చరించేడు వీరాస్వామి.

'ఆళ్ళూ మనలాంటోళ్ళే. ఆళ్ళని జంపితే మనకేమొత్తది. మనం మనం గొట్టుకున్నట్టే.'

'మీ ముసిలాళ్ళకేం జెప్పినా యింతే. ఏదో అడ్డుపుల్లేత్తారు.'

'కుర్రకుంకవి. నీకేం తెల్సురా. పోలీసోళ్ళొచ్చారంటే ఎముకల్లోకి సున్నం లేకుండ దంచేత్తారు.'

'అయితే ఆళ్ళని పన్జెయ్య నియ్యటమేనా?'

నూకాలు లేచేడు.

'ఇప్పుడు మన ముందున్న సమస్యలు రెండు. వాళ్ళిచ్చే కూలిరేట్లు అంగీకరించి పనుల్లోకి పోవటమా? లేకుంటే ఆ వొచ్చే వాళ్ళని

రాకుండ చేసి హెచ్చు రేట్లకోసం పోరాడటమా? నాకు తెల్సినంత వరకూ రైతులు మనం చెప్పిన రేట్లకు అంగీకరించరు. అలాగవి కోత కొచ్చిన పంటనూ ఒదులుకోరు'

సత్తెయ్య అందుకున్నాడు.

'నాదో సిన్న సలా. ఇప్పటికి పాలేళ్ల సమ్మె ఒదిలేద్దాం. ఇంక పై వూళ్లనించి జనం ఒచ్చి పనిజేత్తె చెయ్యనియ్యండి. ఆపైన ఏం చెయ్యాలన్నది యువజన సంఘానికి ఒదిలెయ్యండి' అన్నాడు.

సత్తెయ్య ప్రతిపాదనపై తర్జన భర్జనలు జరిగేయి. చివరకు అంతా బలపర్చేరు.

పైవూరి కూలీలు కోతలు కోస్తున్నారు. పొలాల్లో మంచి కోలాహలంగా వుంది.

యువజన సంఘం ఏం ఆలోచించుకుందో ఏమో, ఏమీ అలజడీ ఆందోళనల్లేవు.

అర్ధరాత్రి, వూరు నద్దుమణిగేక, పేటలో రావిచెట్టు బండ దగ్గర సద్దులేని కోలాహలం రేగింది.

రామాలయం అరుగుమీద నూకాలు, మరో పదిమంది ముసలాళ్లు మాట్లాడుకుంటున్నారు.

వరి మోపులు ఒక్కొక్కటే వచ్చి పడుతున్నాయి. బండమీద కొట్టి గింజలు రాలుస్తున్నవాళ్ళు రాలుస్తున్నారు. ఎత్తేవాళ్ళు ఎత్తుతున్నారు.

పేటలో చాలా రోజుల తర్వాత కప్పుల మీంచి పొగలేచింది. ఆ పచ్చిగింజలే వేపుకుని బియ్యం చేసుకుంటున్నారు.

నూకాలు మాటల్లో పడిపోయేడు.

'మనమేం దొంగతనం చెయ్యటంలేదు. పావలా కూలిచ్చి పది రూపాయిల పని చేయించుకుంటున్నవాళ్లు దొంగలు. మనమెందుకు దొంగలె మవుతాం? ఏళ్ళతరబడి కష్టపడి మనం సాగులోకి తెస్తేనే

ఆ పొలాలు పండేయి. మనభాగం మనం పుచ్చుకోవాల్సిందే. పొలాలూ పంటలూ జాతి కంతటికీ చెందినవి. అంతా అనుభవించాల్సిందే...'

'....పాండవులు యుద్ధం ఎందుకు చేశారు? వాళ్ళకిమాత్రం జననష్టం ఇష్టమా? వాళ్ళభాగం వాళ్ళకి ఇవ్వమని అడిగేరు. సూది మోపినంత నేలైనా ఇవ్వమంటే.... యుద్ధమే శరణ్యమైంది'.

★